

# నాన్న పోయింతరువాత

## శిరంశెట్టి కాంతారావు

తల్లా? పెళ్ళామా?

ప్రతి మగవాడి జీవితంలోనూ ఏదో ఒక సందర్భంలో ఇది తప్పనిసరిగా ఎదురయ్యే సమస్యే అయినా, నా విషయంలో మటుకు అది నాన్న పోయిం తరువాత మరీ విషమ సమస్య అయి కూర్చుంది.

మా అమ్మా, నాన్నలకు నేను, అక్కా ఇద్దరమే సంతానం.

ఇప్పుడు నాకు నలభై మూడేండ్లు. అక్క నాకన్నా రెండేండ్లు పెద్దది. బావ వ్యవసాయం చేస్తుంటాడు. నేను మా ఊరికి దూరంగా స్కూల్ అసిస్టెంట్‌గా చేస్తున్నాను.

మా అమ్మ నాన్నలకు మా ఊరి చెరువుకింద ఓ అర ఎకరం పొలం, ఊళ్ళో ఓ పెంకుటిల్లు తప్ప వేరే ఆస్తిపాస్తులేం లేవు. ఆ పొలాన్ని కూలి అరకలతోనో, ట్రాక్టర్‌తోనో దున్నించి నాటు వేసిం తరువాత ఊళ్ళో రైతులకు వ్యవసాయ పనులకెళ్ళి సాయంత్రానికల్లా నాలుగు రూపా యలు సంపాదించుకుని గుట్టుగా కాపురం వెళ్ళ దీసుకుంటున్నారు.

నాది, నా భార్యది కూడా ఒకే ఊరు. మా కన్నా వాళ్ళది బాగా కలిగిన కుటుంబం. భూములు తోటలు ఉన్నాయి.

ఇద్దరు అన్నదమ్ముల మధ్య మా ఆవిడ ఒక్కతే ఆడపిల్ల కావడంతో ఎంత గారాబంగా పెరగాలో అంత గారాబంగా పెరిగింది. ఆ గారాబమే మరీ ఎక్కువై చదువబ్బక పదవ తరగతి తప్పి ఇంట్లో కూర్చుంది.

వాళ్ళకూ, మాకూ కాస్త దూరపు చుట్టరికం ఉండడంతో పాటు, నేను కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించడంతో వాళ్ళ నాన్న చూపు నా మీద పడింది.

దాంతో ఆయనోరోజు నేరుగా మా ఇంటికొచ్చి ''రెండెకరాల పొలం, మూడు లక్షల రొక్కం ఇచ్చి నాకూతుర్నిస్తా చేసుకోండి'' అంటూ మా నాన్న ముందు ప్రతిపాదన పెట్టాడు.

అంతటివాడు ఇంటికొచ్చి పిల్లనిస్తాననడమే కాక భూమి ఇస్తాననడంతో మా నాన్న వెనకా, ముందు ఆలోచించకుండా ''సరే'' నంటూ ఒప్పుకున్నాడు.

అందుకు ఆయన కారణం ఆయనకుంది. భూమి ఓ సామాజిక హోదాకు ప్రతిరూపం. పెద్దగా భూమిలేని నాన్నకు కొడుకు ద్వారా భూవసతి కలిసొస్తుండడంతో వెంటనే వప్పుకున్నాడు.

నాన్న ఇచ్చిన మాటను అమ్మ కాదనలేకపోయింది కానీ, అయిన వాళ్ళతో ఏం మాటొస్తుందోనని తెగభయపడసాగింది.

అన్నింటికంటే ముఖ్యంగా ఈ సంబంధం చేసుకుంటే జీవితంలో స్థిర పడొచ్చన్న దురాశ ఒకటి



తోక చుక్కలా నా మనసులో పొడుచ్చుకు రావడంతో గతం మర్చిపోయి పెళ్ళికి ఒప్పుకున్నాను.

ఆరు నెల్లు తిరిగేసరికి నా పెళ్ళి జరిగిపోయింది.

అయితే, ఆ పెళ్ళి మా కుటుంబంలో ఎన్ని సమస్యలకు దారి తీస్తుందో ఆ క్షణంలో నేను ఊహించలేక పోయాను.

***

నా భార్యకు చదువైతే అబ్బలేదు. కానీ, తాము బాగా కలిగిన వాళ్ళమనే అహంభావం, దానితో పాటు పెంకితనం మాత్రం బాగా వంటబట్టాయి. ఎంతవరకు వంటబట్టాయంటే పెళ్ళి అయినప్పటి నుండి ఇప్పటిదాకా ఏరోజూ మా అమ్మను 'అత్తయ్యా!' అని కానీ మా నాన్నను ''మామయ్యా!'' అని కానీ నోరు తెరిచి పిలవనంతగా వంటబట్టాయి.

ఒక్కగానొక్క కోడలు 'అత్తా! మామా!' అని పిలవకపోవడంతో అమ్మా, నాన్నలు ఎవరికీ చెప్పుకోలేక, లోపల దించుకోలేక కుమిలి పోసాగారు.

దాంతో అమ్మా, నాన్నలు మా దగ్గరికంటే, అక్క దగ్గరికే ఎక్కువగా వెళ్ళి వస్తుండడంతో ఇబ్బంది అనిపించిన నేను ''మీరు మాటి మాటికీ అక్క దగ్గరికెందుకెళుతున్నారు? ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు?'' అంటూ ఓ రోజు వాళ్ళమీద చిరాకుపడ్డాను.

వాళ్ళనంటే మందలించి అక్క ఇంటికి తరచుగా వెళ్ళకుండా చెయ్య గలిగాను. కానీ, నా భార్యను మాత్రం మందలించి, వాళ్ళు ఆశపడు తున్నట్టుగా పిలిపించలేక పోయాను.

***

నాన్నకు డెబ్బై ఐదేండ్లొచ్చాయి.

తన వయసున అడవి పావురంలా రాళ్ళు తిని, రాళ్ళు అరిగించుకున్న నాన్న పేగుల్లో పూత వచ్చి పుండు పడడంతో ఏవి తిన్నా అరిగించు కోలేక, అసలు తినడమే తగ్గించేశాడు. దాంతో, ఒకప్పుడు శివాలయం ముందు నందీశ్వరునిలా ఉండే నాన్న ఇప్పుడు చూస్తే పూచికపుల్లలా తయారయ్యాడు.

ఆస్పత్రుల చుట్టూ తిరిగి, తిరిగి, రకరకాల మందులు తినీ, తిని వేసారి పోయిన నాన్నను పట్నం తీసుకెళ్ళి పెద్దాస్పత్రిలో చూపిద్దామని చెప్పి అమ్మా, నాన్నను నా ఇంటికి తీసుకొచ్చాను.

తీసుకొచ్చిన మరుసటిరోజు రాత్రి తీవ్రమైన కడుపు నొప్పి వచ్చి మెలికలు తిరిగి పోతున్న నాన్నను, ఆ రాత్రికిరాత్రే కారులో పట్నంలోని పెద్దాస్పత్రికి తీసుకుపోయాను.

నాన్న వాడుతున్న మందులన్నీ పరిశీలించిన పెద్దాస్పత్రి డాక్టర్ ''కడుపులో పుండుకి ఎవరు వ్రాసినా ఇవ్వే మందులు. ఇవ్వే వాడండి'' అంటూ మా సంతృప్తి కోసం అన్నట్టు ఏవో రెండు పెయిన్ కిల్లర్స్ రాశారు.

''ఆపరేషన్ చేస్తే, ఏమైనా ఫలితమంటుందేమో చూడండి డాక్టర్!'' అన్నాను ఆశగా.

''పెద్దవయసొచ్చింది. పైగా బిపి, షుగర్ రెండూ ఉన్నాయి. నాకు తెలిసినంతవరకు ఆయనకు ఆపరేషన్ అనవసరం. అంతగా మీరు చెయ్య మంటే చేస్తాను, కాని గ్యారెంటీ ఇవ్వలేను'' అంటూ పెదవి విరిచాడు.

***

ప్రతి రోజూ నేను బడికి వెళ్ళేలోపే అమ్మా, నేనూ కలిసి నాన్నకు స్నానం చేయించి బట్టలు పక్క దుప్పట్లూ మార్చి, రాగుల జావతాగించే వాళ్ళం.

ఇంత జరుగుతున్నా మా ఆవిడలో ఏ మాత్రం చలనం రాలేదు. తనేంటో, తన పనేంటో తప్ప పెద్ద మనుషులతో మాట లేదు. ముచ్చట లేదు.

''గుప్పెడు రోగంతో చావుకు దగ్గరయిన నాన్నను, నాన్నను చూసు కుంటూ గుండెలు ఆర్చుకుపోయేలా దుఃఖిస్తున్న అమ్మను కనీసం ఇప్పు డన్నా పలకరించ రాదు'' అంటూ చూసీ, చూసీ ఓర్చుకోలేక ఓ రోజు మా ఆవిడతో గొడవపెట్టుకున్నాను.

కాని, చెవిటివాని ముందు, ఎంత శంఖం ఊదితే మాత్రం లాభమేంటి?

'ఏం వేళకు వండడం లేదా? పెట్టడం లేదా? చేసేది చేస్తూనే ఉన్నా నన్నెందుకిట్లా రాచిరంపాన పెడతారు?'' అంటూ నామీదే ఎదురు దాడికి దిగింది.

దాంతో, అసలే ఆరోగ్యం బాగోలేక మంచాన పడిన నాన్న వింటే ఎక్కడ బాధపడతాడోనన్న భయంతో నన్ను నేనే సముదాయించుకుని, కుక్కిన పేనులా నోరు మూసుకున్నాను.

పదిమంది పిల్లలకు పాఠాలు చెప్పే పంతులు స్వంత పెళ్ళానికి చెప్పు కోలేక ముసలివాళ్ళను ఉసురు పెడుతున్నాడని ఇరుగు – పొరుగు వాళ్ళు ఎక్కడనుకుంటారోనన్న బిడియం నాలో రోజు, రోజుకూ పెరిగి పోతుండడంతో సాధ్యమైనంతవరకు వాళ్ళను తప్పించుకుని తిరగ సాగాను.

***

ఈ మధ్య నాలుగైదు రోజులుగా నాన్న పరిస్థితి మరీ దిగజారి పోవడంతో బడికి శెలవుపెట్టి అమ్మతోపాటు నాన్న మంచం దగ్గరే కనిపెట్టుకు కూర్చుంటున్నాను.

మరీ నిన్నటినుండి కడుపులోకి కనీసం ఓ పాల చుక్కకూడా పోవడం లేదు. కడుపు నొప్పితో మెలి తిరిగిపోతూ... మధ్యమధ్య కాస్త తెరిపిచ్చినప్పుడు ''ఎందుకైనా మంచిది మీరంతా తొందరగా అన్నాలు తినెయ్యండి. అమ్మాయిని వెంటనే పిలిపించండి. అసలు ముందు నన్నీ మంచం మీది నుండి దించి కింద పడుకోబెట్టండి'' అంటూ అన్నీ పరాకు మాటలు మాట్లాడసాగాడు.

''నాన్న పరిస్థితి ఏమీ బాగోలేదు వెంటనే బయలుదేరి రండి'' అంటూ నిన్ననే ఫోన్ చేయడంతో అక్కా, బావా వాళ్ళు మాటల్లోనే వచ్చేశారు.

అక్కను చూడగానే నాన్న కనుకొలుకుల నుండి 'బొట, బొటా' నీళ్ళు కారిపోతుంటే అక్కను, నన్నూ చెరో చేత్తో దగ్గరికి తీసుకుని ''మీ అమ్మ వట్టి అమాయకురాలు, దాన్ని మాత్రం జాగ్రత్తగా చూసుకోండి'' అంటూ ఇంకేదో చెప్పబోతూనే 'భళ్ళు' న 'రక్తం' వాంతిచేసుకుని, గట్టిగా మూలుగుతూ .... మంచం మీద అంతెత్తున ఎగిరెగిరి పడుతుంటే అక్కా, నేను గట్టిగా అదిమి పట్టుకున్నాము.

మా పుట్టుకకు బీజమై, మా బ్రతుకులకు ప్రణవ నాదమై నిన్న, మొన్నటిదాకా తన రెక్కల కష్టం అనే అక్షయపాత్రతో మా కోరికలను, ఆశలను తీర్చిన నాన్న మా చేతుల్లోనే తన చివరి శ్వాస వదిలేశాడు.

నాన్న ఇక లేడన్న చేదునిజాన్ని కళ్ళారా చూసిన అమ్మ గుండెలు పగిలేలా రోదిస్తూ. స్పృహ తప్పి కూప్పకూలిపోయింది.

***

పదకొండవరోజున పెద్దకర్మ అయిపోవడంతోనే భోజనాలు చేసిన చుట్టాలంతా ఎక్కడి వాళ్ళు అక్కడ 'రీతి' ప్రకారమ మాకు చెప్పకుండానే వెళ్ళి పోయారు.

అదేరాజు రాత్రి నేను, మా మేనమామ అమ్మను తీసుకుని పక్క ఊరిలోని గుడిలో నిద్రచేసి వచ్చాను.

ఆ మధ్యాహ్నం భోజనాలు చేస్తున్నప్పుడు

కవిత

## నాయకుడు-వినాయకుడు



*గోరంత పత్రినర్పిస్తేనే*
*కొండంత పరవశించే వాడు వినాయకుడు!*
*నోట్లతో ఓట్లు కొని*
*కోట్లకు పడగలెత్తేవాడు నాయకుడు!*
*మొదటి దండం నీకంటే చాలు*
*మెచ్చి అభయమిచ్చేవాడు వినాయకుడు*
*పూటకో మాట మార్చి*
*ప్రజలను ఏమార్చేవాడు నాయకుడు!*
*ఉండ్రాళ్ళు సమర్పిస్తేనే*
*ఉప్పొంగిపోయే వాడు వినాయకుడు!*
*చిరుబొజ్జతో గద్దెనెక్కి*
*బాన బొజ్జలు పెంచేవాడు నాయకుడు!*
*చల్లగా నిమజ్జనం చేస్తే*
*ఎల్లప్పుడూ తోడుగా వుండేవాడు వినాయకుడు!*
*తన స్వార్థానికి త్యాగం పేరుతో*
*శవ రాజకీయాలు చేయగల సమర్థుడు నాయకుడు*
*అందుకే...*
*నిస్సిగ్గుగా పదవి వెంటపడి*
*'నా'దంటూ పరుగులెత్తి అయ్యాడిపుడు 'కల్' నాయకుడు!*
*కోరి ప్రార్థించినంతనే*
*'వి'రివిగా వరాలిచ్చే దేవుడు వినాయకుడు!*
*ఆయనే... ఈ అఖిల జగానికీ*
*అసలైన అధినాయకుడు!!*

**–ఎ.ఎస్.అనిత**
**సెల్: 92475 00819**

చేతన సచివాలయ సారస్వత వేదిక ఆధ్వర్యంలో జరిగిన పోటీలో ప్రథమ బహుమతి పొందిన కవిత

"మీరీ పూట అమ్మను తీసుకు పోయి నిద్ర చేయించి పంపితే, నేను మా ఇంటికి తీసుకుపోతాను" పసుపు, కుంకుమలు కోల్పోయిన స్త్రీని పుట్టింటి వాళ్ళు మొదట నిద్రకు తీసుకుపోనిదే ఆఖరికి కన్న కూతురు కూడా తీసుకుపోవడానికి సంశయించే దౌర్భాగ్యపు 'రివాజు' ఒకటి మన నర, నరంలోనూ జీర్ణించుకు పోవడంతో అదేబాటలోనూ మేనమామను అడిగింది అక్క.

"అయ్యో, నెల్రోజుల్దాకా తీసుకుపోవడానికి మాకు కుదర్దమ్మా!" మామయ్య కన్నా ముందు తనే కల్పించుకుంటూ సమాధానం చెప్పింది ఆయన భార్య.

"అదేం!" పెరుగన్నం కలుపుకుంటూ అడిగింది అక్క.

"మా రంగడు అయ్యప్పమాల వేసుకున్నాడు. దేవుని దగ్గరకి పొయ్యొచ్చిందాకా తీసుకు పోగూడదట. వచ్చేటప్పుడు బ్రాహ్మణున్ని అడిగొచ్చాం. అసలిప్పుడు కూడా మమ్మల్ని పొవ్వొద్దన్నా, మొఖం జూసే పని, పైగా పుట్టింటి పుసుపు కుంకుమలు తీసుకురావాలి గదా! లేకపోతే నలుగురు, నాలుగు రకాలుగా అనుకుంటారని దేవునిమీద భారమేసి తీసుకొచ్చాం" తమ బాధ్యతను తెలివిగా దేవునిమీద తోసేస్తూ ఊపిరి గూడా తీసుకోకుండా గడ, గడా చెప్పేసింది మా మేనమామ భార్య.

"దేవుని మీద భారంవేసి ఎట్లాగూ వచ్చారు గదా! అట్లాగే తీసుకు పొయ్యి ఒక్కపూట నిద్ర చేయించి పంపించండి చాలు. ఆ తరువాత మా తిప్పలు మేం పడతాం గాని" గతం, అంకుశంలా నా అంతరంగాన్ని గుచ్చు తున్నా తప్పదు కాబట్టి కల్పించుకుంటూ అన్నాను నేను.

యాభై ఏండ్లపాటు తన తోడు, నీడగా నిలిచిన నాన్నను పోగొట్టుకుని దుఃఖంతో కునారిల్లిపోతూ కూర్చున్న అమ్మ ఆమె మాటలు వింటనే "నా గురించి ఎవ్వరూ ఇబ్బందిపడొద్దు. లోకం మీద అందరూ తోడబుట్టిన వాళ్ళేఉన్నారా? వాళ్ళందరికీ ఎట్లా జరుగుతుందో నాకు అట్లాగే జరుగు తుంది. దాని కోసం మీరెందుకు కంగారుపడతారు?" తమ్ముని భార్య మాటలతో మనసు నొచ్చుకున్న అమ్మ నిష్ఠూరంగానే మాట్లాడింది.

అమ్మ మాటలు విన్న మా మేనమామ అటు భార్యకు చెప్పలేక, ఇటు సాంప్రదాయాన్ని కాదన లేక మౌనంగా తలవంచుకు కూర్చున్నాడు.

"పోనీ ఒక పనిచేస్తే; మీ స్వామిని నలభైరోజులు వేరే ఇల్లు తీసుకుని అక్కడే పీఠం పెట్టుకుని పూజ చేసుకొమ్మనండి, సరిపోతుంది గదా!" నన్ను వాళ్ళింటికి తీసుకుపోవడానికొచ్చిన మా చిన్నబావ మరిది మధ్యలో కల్పించుకుంటూ అన్నాడు.

"పెట్టినపీఠం కదిలించగూడదట. వచ్చేటప్పుడు ఆ సంగతికూడా తెలుసు కునే వచ్చాం. కాకపోతే మూడో నెల తగిలాక వచ్చి తీసుకుపోతాం" అంటూ ఎంతో గడుసుగా సమాధానం చెప్పింది మా మేనమామ భార్య.

ఈ తర్జన, భర్జనలన్నీ వినీ, వినీ విసుగొచ్చిన మా అక్క "సర్లే! ఇవ్వన్నీ ఎందుగ్గాని అమ్మను నేనే తీసుకు పోతాన్లేరా!" అంటూ అంతటితో ఆ చర్చను ముగించాలని చూసింది.

వంతన తప్పించి మీ ఇంటికొస్తే మంచే జరిగేనా? చెడే జరిగేనో? ఎందు కొచ్చిన తంటా వద్దమ్మా? నేనెక్కడికీ రాను" వల, వలా కంటికి కడివిడు ఏడుస్తూ చెప్పింది అమ్మ.

"నాన్న ఒక్కడు జరిగిపోవడంతో అమ్మ పరిస్థితి ఒక్కసారిగా తుఫాన్ గాలికి కూలిపడిన వటవృక్షంలా అయిపోయింది గదా!" అన్న భావన నా గుండెల్లో 'గాలం'లా గుచ్చుకో సాగింది.

అమ్మ మాటలు విన్న మామయ్య వాళ్ళకు కొంచం చురుక్కుమన్నట్టుంది. మరో మాట మాట్లాడకుండా వెంటనే లేచి వెళ్ళిపోయారు.

ఇంత జరుగుతున్నా చూస్తూ కూర్చున్న మా ఆవిడ ఒక్క మాట మాట్లాడ లేదు! సరికదా "ఎవరికి తప్పినా నాకు తప్పదుకదా?" అంటూ కూర్చున్న చోటు నుండి లేచి ఇంట్లోకి నడిచింది.

ఆమె మాటలతో అమ్మా, అక్కా నా వంక చూస్తుంటే నేను వాళ్ళ కళ్ళల్లోకి చూడలేక తలవంచుకున్నాను.

***

నేను ఇంట్లో ఉన్నంతసేపు మాత్రమే అమ్మ ముఖంలో అంతో, ఇంతో జీవకళ కన్పిస్తుంది. నేనటు బడికి వెళ్ళగానే తానిటు ఓ మూల మంచం వాల్చుకుని పలుకరించేవాళ్ళు లేక తపస్వినిలా మౌనంగా కూర్చుంటుంది. మళ్ళీ నేను బడి నుండి వచ్చేదాకా అదే పరిస్థితి.

అమ్మ అవస్థను చూడలేని నేను ఎన్ని రకాలుగా బుజ్జగించి చెప్పినా తను అమ్మతో మాట్లాడక పోగా, మాట్లాడే పిల్లలకు కూడా ఏం నూరి పోసిందో గాని, వాళ్ళూ అమ్మతో మాట్లాడడం మానేశారు.

"కోడలంటే మొదటనుండీ మాట్లాడడం లేదు. సరే, పోనీ అనుకుంటే, ఇప్పుడు పిల్లలు కూడా మాట్లాడడం లేదు. వాళ్ళను నేనేమన్నాను?" అన్న ఆలోచనలతో అమ్మకలత చెందసాగింది.

దాంతో, మా ఇంట్లో నుండి ఎప్పుడు బయటపడతానా అన్న నిరీక్షణ పదునైన ఆయుధమై మనసును కోసేస్తుంటే... మీ ఇల్లే ఓ అంపశయ్యగా మారిన అమ్మకు, రోజులు కందెనలేని ఎద్దుల బండిలా భారంగా గడవ సాగాయి.

మూడవ నెల తగలగానే వచ్చి అమ్మను తీసుకు పోతామన్న మా మేనమామ వాళ్ళు నెల వెళ్ళిపోతుందన్నా జాడలేక పోవడంతో ఉండబట్ట లేక ఓ రోజు నేనే ఫోన్ చేశాను.

"మా పాలాయన ఒకడు మొన్ననే గుండెపోటుతో పోయాడు. మైల తీరిందాకా తీసుకు పోగూడదని రాలేదు" ఫోనెత్తిన మా మమయ్య ఏదో చెప్పబోతుండగా తను ఫోన్ తీసుకుని పాఠం అప్పగించినట్టు తడుము కోకుండా జవాబు చెప్పింది ఆయన భార్య.

"అప్పటిదాకా ఆగితే మళ్ళీ నాలుగో నెల వస్తుంది కదా! ఇప్పటికే ఎటూ వెళ్ళడానికి లేక అమ్మ చాలా ఇబ్బంది పడుతోంది" అంతకన్నా ఏం మాట్లాడాలో అర్థం గాక ఆగిపోయాను.

"వీలు కానప్పుడు ఎవరైనా ఏం చేస్తారు? అయినా, ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకునేటప్పుడు శుభంలో లేని చుట్టరికం, అశుభంలో మాత్రం అక్కర కొస్తుందా? అయినా నీకు చెప్పేటంతటి దాన్నా?" పాతికేళ్ళుగా తన మనసులో నా మీద పేరుకుపోయిన కసినంతా ఒక్కసారిగా వెళ్ళగక్కుతూ పరుషంగా మాట్లాడింది మా మేనమామ భార్య.

అమె మాటలు వింటుంటే, వాళ్ళు కావాలనే అమ్మను తీసుకుపోవడం లేదనే విషయం అర్థమైంది నాకు.

ఆ క్షణంలో నా మనసు పాతికేళ్ళ గతంలోకి వెళ్ళిపోయింది.

***

ఈడు... జోడు... అందం... ఐశ్వర్యం
కళ్యాణం... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్: 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search

www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌షుఖ్‌నగర్, విజయవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఖమ్మం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, (చెన్నయ్) టి.నగర్, బెంగుళూర్, సేలం, మధురై, వెల్లూరు, తిరుచి, పాండిచ్చేరి, ఈరోడ్, ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

''అక్కా! ఇప్పటికి మీ ఇంటిచుట్టూ ఎన్నిసార్లు తిరిగానో లెక్కలేదు. వచ్చిన ప్రతిసారీ ఏదో ఒకటి చెప్పి పంపిస్తున్నారు. అసలు చేసుకుంటారో, లేదో ఏదో ఒకటి తేల్చుకురమ్మని అవతల మీ మరదలు నా ప్రాణం తింటోంది. చిన్నప్పటి నుండీ అనుకుంటున్న సంబంధ మేనయ్యే. ఇంకా ఆలోచించేదేంటి?

ఇన్నాళ్లూ పిల్లవాడి చదువు ఆగమవుతుందని దాటవేసుకుంటూ వచ్చారు. ఇప్పుడు వాడి చదువై పోయి, ఉద్యోగం కూడా వచ్చింది కదా? మరింకెం దుకాలస్యం? తెలిసిన వాళ్ళంతా పెళ్ళెప్పుడని అడు గుతుంటే ఏం చెప్పాలో అర్థం గాక ఛస్తున్నాం. ఈరోజు ఏదో ఒకటి తేల్చి చెప్పంది ఇక్కణ్నుంచి కదలను''. ఓ రోజు పొద్దున్నే మా ఇంటికొచ్చిన మేనమామ తన కూతురుని నాకు చేసుకొమ్మని అమ్మా, నాన్నల మీద వత్తిడి చేశాడు.

''అరే! నాదే ముందయా? అంతా మీ అక్క ఇష్టం, మీ మేనల్లుని ఇష్టం. వాళ్ళ ఇష్టాన్ని నేనె ప్పుడన్నా కాదన్నానా? అదేదో మీరూ, మీరూ తేల్చుకోండి'' ఎప్పటిలాగే తన మీద ఏదీ ఉంచు కోని నాన్న తనదైన బాణీలోనే సమాధానం చెప్పి, నింపాదిగా పొర చుట్ట చుట్టుకుంటూ సావకాశంగా మంచం మీద కూర్చున్నాడు.

''ఏమిరా! ఏం చెప్పమంటావ్? ఈ పెళ్ళి విష యంలో నా మనసు తెలిసిన అమ్మ ఎటూ చెప్పలేని సందిగ్ధ స్థితిలో ఏం చేస్తాం?'' అన్నట్టు నిశ్శబ్దంగా కళ్ళతోనే ప్రశ్నించింది.

''నువ్వే ఏదో ఒకటి సర్దిచెప్పి పంపించమ్మా!'' అన్నట్టు అమ్మ వంక నిస్సహాయంగా చూశాను.

వచ్చినవాడు ఎంతైనా అమ్మకు తమ్ముడే గదా! ఆ తెలివితేటలెక్కడికి పోతాయి! అన్నట్టు మా వంక తీక్షణంగా చూస్తూ ''మీలో మీరు అలా కళ్ళతో మాట్లాడకుంటే నాకెలా తెలుస్తుంది? అదేదో నేరుగా నాతోనే చెబితే సరిపోతుంది గదా'' అసహనంతో రగిలిపోతూ అన్నాడు.

''మేనరికాలు చేసుకోవడం మంచిది కాదం టున్నాడ్రా వాడు'' నా కోసం తోడబుట్టిన వాడితో చెప్పలేక చెప్పింది అమ్మ.

అమ్మ మాటలకు మామయ్యతో పాటు నాన్న కూడా ఆశ్చర్య పోయినట్టు అమ్మ వంక కళ్ళు ఆర్పడం కూడా మరిచిపోయినట్టు చూడసాగాడు.

''ఈ మాట చెప్పడానికేనా నన్నిన్ని సార్లు మీ ఇంటి చుట్టూ పిల్లికూనలా తిప్పుకుంది. లోకంమీది ఎవ్వరూ మేనరికాలు చేసుకోవడం లేదా? ఇవ్వాళ్ళ నీ కొడుక్కి ఉద్యోగం దొరికే సరికి మేనరికం పనికి రాకుండా పోయిందా? లేకుంటే వేరే లక్షలిచ్చే సంబంధం దొరికిందా?'' అంటూ తన కసినంతా అమ్మ మీద వెళ్ళగక్కుతూ మాట్లాడిన మామయ్య, నాన్న ఆగమన్నా ఆగకుండా లేచి వెళ్ళిపోయాడు.

అట వెళ్ళడం వెళ్ళడం నెల తిరిగే సరికి వేరే సంబంధం చూసి నాకంటే ముందే వాళ్ళ అమ్మా యికి పెళ్ళి చేసిన మామయ్య, మమ్మల్ని పిలవను కూడా పిలవలేదు.

ఆ తరువాత ఆరు నెల్లకు నా పెళ్ళికి నేనే స్వయంగా మామయ్య వాళ్ళ ఇంటికెళ్ళి 'శుభలేఖ' ఇచ్చి వచ్చినా వాళ్ళెవ్వరూ రాలేదు.

తోడ బుట్టినదై ఉండి కట్నం కోసం అమ్మే నాకు వేరే సంబంధం చూసిందన్న అపోహతో ఇన్నేళ్ళుగా మా ఇంటికి రాని మేనమామ వాళ్ళు నాన్న చావుకి వచ్చారు.

***

''ఇంకా ఎంతసేపు ఆ ఫోన్ పట్టుకు నిల్చుంటా వురా!'' అంటున్న అమ్మ మాటలతో తిరిగి వాస్త వంలో కొచ్చాడు.

అప్పటిదాకా రేపో, మాపో తన తమ్ముడు వచ్చి తీసుకుపోతాడని ఆశతో ఎదురు చూస్తున్న అమ్మకు ఉద్దేశ్య పూర్వకంగానే వాళ్ళు తీసుకు పోవడం లేదని నిజం తెలిసి రావడంతో మా ఇంట్లో ఉండడం ఆమెకు మరింత భరింపరానిదిగా తయారయ్యింది.

దానికితోడు తను మా ఇంట్లో ఉండడం వల్లనే ఆడపిల్ల కూడా తనను చూడడానికి రావడం లేదన్న నిర్ధారణ కొచ్చిన అమ్మ ''నన్ను మనింటి దగ్గర దించిరారా! అక్కడైతే ఉన్న ఊరు, ఎరిగిన మనుషులు ఎట్లాగైనా పొద్దుపోతుంది'' అంటూ ప్రతి రోజూ నా వెంట పడసాగింది.

''ఇన్నాళ్ళంటే నాన్న ఉన్నాడు కాబట్టి ఒకరికొ కరు తోడుగా ఉన్నారు. ఇప్పుడు ఒక్కదానివి ఆ ఇంట్లో ఎట్లా ఉంటావు? పైగా కాలు నొచ్చినా, కన్ను నొచ్చినా పట్టించుకునే వాళ్ళెవరున్నారు? ఏదన్నా అవసరమొచ్చినా పక్కింటికి కూడా వెళ్ళే టట్టు లేదయ్యె. ఎక్కడికీ వెళ్ళొద్దుగాని ఊరుకో'' అంటూ పరి పరి విధాల అమ్మను సముదాయిం చాను.

నా మాటలన్నీ సావకాశంగా ఆలకించిన అమ్మ నావంక చూస్తూ ''అవ్వన్నీ వద్దులేరా! ముందు నన్నిక్కణ్ణుంచి, మనింటికి పంపించు చాలు గాని'' అంటూ తన మాట మీదే ఉంది.

''అమ్మ అడుగుతున్నట్టుగా ఆమెను ఒక్కదాన్నీ ఊళ్ళో దించివస్తే, భార్యకు సమాధానం చెప్పుకో లేక ముసలమ్మను ఒక్కదాన్నీ వంటరిగా వదిలి వెళ్ళాడని ఊరంతా కోడై కూస్తుంది.

తను కూడా ఇంకా బతికినంతకాలం బతుకు తుందా? ఆమెకు మనం తప్ప ఎవరున్నారు? ఆమెను చూడాల్సిన బాధ్యత మనదేగదా?'' ఓ రోజు రాత్రి మా ఆవిడ దగ్గర చివర ప్రయత్నం చేశాను. అయినా అటు వైపు తిరిగి పడుకుంది తప్ప ఒక్కమాట మాట్లాడలేదు.

***

నాన్న పోయిన దగ్గర నుండి ఏడ్చీ, ఏడ్చీ ఎండు పిడకలా అయిపోయిన అమ్మను వెంట బెట్టుకుని మెల్లగా ఓ రోజు మా ఊరికి వెళ్ళాను.

ఐదు నెల్లకే ఇల్లు పీర్లచావిడిలా తయార య్యింది. ఇంటి చుట్టూ ఇంతెత్తున పిచ్చి మొక్కలు లేచాయి. తలుపులు, ద్వారబంధాలు, కిటికీలు చెదలు పట్టాయి. ఇంటిపై కప్పుకు, గోడలకు ఇంత మందాన సాలెగూళ్ళు వేళ్ళాడుతున్నాయి.

ఇంట్లో అడుగడుగునా నాన్న జ్ఞాపకాలు కళ్ళ ముందు కదలాడుతుంటే నన్ను నేను తమాయిం చుకుంటూ ఇద్దరు కూలీలను పెట్టి ఇల్లంతా బాగు చేయించే సరికి నిండా రెండు రోజులు పట్టింది.


ఈ రెండు రోజులూ ఊళ్ళో వాళ్ళంతా వచ్చి అమ్మను పలుకరించి పోతూనే ఉన్నారు.

వాళ్ళల్లో అమ్మ వయసు ముసలమ్మలు ముగ్గురు ఎవరెవరి ఇంట్లో, ఎవరెవరి కొడుకులు, కోడళ్ళు ముసలోళ్ళను కన్నవాళ్ళను కనికరం లేకుండా ఎట్లా ఏడిపిస్తున్నారో, ఎంత చిన్న చూపు చూస్తున్నారో వైన, వైనాలుగా అమ్మతో చెప్పుకొచ్చారు.

వాళ్ళ మాటలు వింటుంటే పైప్రాణాలు పైన్నే పోయినట్టు అన్పించిన నేను పని ఉన్నట్టు పక్కకు తప్పుకుని, తప్పుకుని తిరిగాను.

ఓ నెల రోజులకు సరిపడా కిరాణా సరుకులు ఇంట్లో తెచ్చిపెట్టి ''మళ్ళీ వచ్చే వారం వస్తానమ్మా'' అంటూ తిరుగు ప్రయాణమయ్యాను.

అయితే, నా మాటలు నాకే ఎబ్బెట్టుగా అనిపిం చాయి. ఎందుకంటే అమ్మ భౌతిక అవసరాలకైతే వస్తువులు సమకూర్చి పెట్టగలిగాను కానీ, అయిన వాళ్ళు ఆత్మీయత కోసం తపించిపోతున్న అమ్మ తగవును చల్లార్చేటందుకు ఏ వస్తువులు తెచ్చి పెట్ట



గలను? దుఃఖంతో శుష్కించి పోతున్న అమ్మ మనసుకు కావాల్సింది ఆత్మీయతా పరామర్శలే తప్ప ఈ సరుకులు, సామానులు కావు కదా!

మనిషికి తటస్థించే ప్రతి దుఃఖంలోనూ, పరాజయంలోనూ మనసుకు తగిలే గాయాలను మానిపించే అద్భుత ఔషధకాలం ఒక్కటే. కొంత కాలం గడిస్తేనే గాని నాన్న జ్ఞాపకాల గాయాల నుండి అమ్మ కోలుకోలేదు. అప్పటిదాకా నాకీ సంవేదన తీరదు.

''ఎందుకురా చిన్నా! నా గురించి అంతగా ఆలోచిస్తావే? పండుటాకు ఏదోరోజు రాలిపోక తప్పదుగా! అటువంటి దానికోసం చింతించడం తప్పురా! నా గురించి కాదు నీ భార్యాబిడ్డల్ని గురించి ఆలోచించు చాలు'' అంటూ హృదయం ద్రవించి పోయేలా మాట్లాడింది అమ్మ.

అమ్మ మాటలు వింటున్న నా మనసు మాగాణిలో ''కొంపదీసి అమ్మ ఏదైనా అఘాయిత్యం చేసుకోదు గదా!'' అన్న అనుమానం మొలకలా మొలుచుకొచ్చి నన్ను ఆందోళనకు గురి చేసింది.

''నువ్వు అనుకుంటున్నట్టు నేనేం చావనురా! దేవుడు ఆ ఆకు చింపేసేటంతవరకు బతుకుతాను. కానీ నువ్వనుకున్నట్టు చెయ్యనురా!'' అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకున్నంత తేలిగ్గా నా మనసులోని సంఘర్షణను చూసిన అమ్మ నన్ను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని ఎదలో పొదువుకుంటూ దృఢంగా చెప్పింది.

అమ్మ మాటలతో కొండంత ధైర్యాన్ని మూటగట్టుకుంటూ తిరుగు ప్రయాణ మయ్యాను.

***

అమ్మ మా ఊళ్ళో వంటరిగా ఉండబట్టి అప్పుడే ఆరు నెల్లు దాటింది. మొదట్లో వారానికి ఒకసారి అమ్మ దగ్గరికి వెళ్ళొచ్చిన నేను రాను, రాను నెలకోసారి కూడా వెళ్ళి రాలేకపోతున్నాను. దాంతో ''వచ్చే ఆదివారం ఎన్ని పనులున్నా పక్కన బెట్టి అమ్మ దగ్గరికి వెళ్ళి రావాలి'' అనుకున్నాను.

అయితే, ఆ మరుసటిరోజే ''నీతో కొంచెం మాట్లాడేదుందిరా! వీలు చూసుకొని ఓసారి వచ్చిపో'' అంటూ అమ్మ దగ్గర నుండి కబురొచ్చింది.

అమ్మ నన్నింత అర్జంట్‌గా ఎందుకురమ్మందో అర్థం కాక, ఆదివారం అనుకున్న వాణ్ణికాస్తా... ఆ మరునాడే స్కూల్‌కి శెలవుపెట్టి ఇంటికి బయలు దేరాను.

ఇల్లు చేరేసరికి మిట్టమధ్యాహ్నం అయ్యింది.

ఇంట్లో అడుగు పెడుతూనే వేప చెట్టుకింద కూర్చొని పని చేసుకుంటున్న వాళ్ళను చూసి అట్లాగే నిలబడిపోయాను.

నన్ను చూడడం తోనే అమ్మ కళ్ళు దుఃఖంతో కాలువలు కడుతుంటే ''రారా! అట్లా నిలబడి పోయావేం?'' గద్గద స్వరంతో అంటూ చెంబుతో కాళ్ళకు నీళ్ళిచ్చింది.

జాలారు బండమీద కాళ్ళు కడుక్కుని ఇంట్లో కెళ్ళి కూర్చుంటూ ''వాళ్ళేంటమ్మా!'' అన్నాను కుతూహలాన్ని ఆపుకోలేక.

''ఔనా! వాళ్ళు. ముగ్గురు నీకు తెలిసినవాళ్ళే గదా! నాతో పాటు మనింట్లోనే ఉంటున్నారు. వాళ్ళూ. నాలాగే తోడును పోగొట్టుకొని వాళ్ళ ఈసడింపులకు చావలేక బతుకుతున్న వాళ్ళు.

ఇండ్లల్లో కొడుకులు, కోడళ్ళ నిరాదరణ దెబ్బకు మనసు గాయమైన వాళ్ళల్లా నా దగ్గరి కొచ్చి తమ గోడు వెళ్ళబోసుకుని పోయేవాళ్ళు.

కన్న వాళ్ళకోసం తమ బతుకంతా ధారబోసిన ఈ ముసలివాళ్ళను ఆదరించవలసిన వాళ్ళే అట్లా చేస్తుండడంతో వీళ్ళకోసం ఏదన్నా చెయ్యాలన్న ఆలోచన వచ్చింది''. అన్నం పెట్టుకొచ్చిన కంచాన్ని నా ముందర పెడుతూ చెప్పింది అమ్మ.

''ఏంటమ్మా! అది'' అన్నం కలుపుకుంటూ అడిగాను.

***

''కడుపున పుట్టిన సంతానం కాస్తా వయసుడిగి పోయేసరికి గింజలు వలుచుకుతిన్న మొక్క జొన్న కంకిని విసిరేసినట్టు వీధిని పడెయ్యాలని చూస్తున్నారు కదా!

ఆ మాటలు పడుకుంటూ ఆ తిండి తిని ఉండేదాన్ని కన్నా మా ఇంటికి వచ్చెయ్యండి. నలుగురం కలిసి మనకు చేతనైన పని చేసుకుంటూ ఒకరి కొకరు తోడుగా బతుకుదాం'' అన్నాను. దానికి వాళ్ళు ముగ్గురూ ''ఇదేదో మంచిగానే ఉంది'' అంటూ ముందుకొచ్చారు.

''కానీ ఏం చేస్తాం? ఎలా బతుకుతాం?'' అన్న ఆలోచనలో పడి పోయారు.

''దానికంత ఆలోచనేం లేదు. ఇదుగో నా వంటి మీద రెండు తులాల బంగారముంది. దాన్ని అమ్మి పారేసి వచ్చిన డబ్బుల్తో మన చేతనైనా పని చేసుకుని బతుకుదాం'' అంటూ ధైర్యం చెప్పాను.

''నీ ఒక్క దాని బంగారమే ఎందుకు? మా వంటి మీదకూడా అంతో, ఇంతో ఉంది. దాన్ని అమ్మేస్తాం. నువ్వనుకున్నది చేద్దాం'' అంటూ వాళ్ళూ ధైర్యంగా ముందుకొచ్చారు.

దాంతో నలుగురం కలిసి పట్నం బొయ్యి వంటి మీది బంగారం అమ్మితే యాభై వేలొచ్చాయి. ఆ యాభై వేలల్లో పాతిక వేలు పెట్టి పేపరు బండిళ్ళు, పొగాకు పెండెలు కొనుక్కొచ్చి వాటితో విస్తళ్ళు కుడుతున్నాం. పొర చుట్టలు చుడుతున్నాం.

తయారైన సరుకును కావాల్సిన వాళ్ళు, సైకిళ్ళ మీద తిరిగి అమ్ముకునే వాళ్ళు ఇంటికే వచ్చి కొనుక్కపోతున్నారు.

ఎవరికైనా ఏ జబ్బో చేసినప్పుడు పనికొస్తుందని చెప్పి మిగిలిన పాతిక వేలు పోస్టాఫీస్‌లో దాచుకున్నాము'' అంటూ వాళ్ళు విజయ గాథను చెప్పుకొచ్చింది అమ్మ.

***

''అయ్యో! పిచ్చక్కా! పిల్లగాణ్ణి అన్నం దిన్నియ్యకుండా చెబుతున్నా వేంది?'' చేస్తున్న పనులను పక్కనబెట్టి వచ్చిన ముగ్గురు పెద్ద మనుషులు అమ్మను ఆత్మీయంగా మందలించారు.

ఆ మందలింపుతో చెప్పడం ముగించిన అమ్మ ''ఇదిరా సంగతి. నీకు చెప్పకుండా చేసినందుకు కోపంతో నొచ్చుకుంటావో, సంతోషంతో మెచ్చుకుంటావో, ఇక నీ ఇష్టం'' అంటూ నా కళ్ళల్లోకి సాభిప్రాయంగా చూడసాగింది.

నేనెంతో అదృష్టం చేసుకున్నాను కాబట్టే ఇటువంటి అమ్మ కడుపున పుట్టాను, అన్న ఆనందంతో మనసు ఉప్పొంగి పోతుంటే ''నిజంగా నువ్వు దేవతవమ్మా! దేవతలెప్పుడూ తప్పులు చెయ్యరమ్మా!'' అంటూ పాలు తాగే పాపాయిలా తన్మయత్వంతో అమ్మ వడిలి వాలిపోయాను.

✻

***రచయిత సెల్ నెం: 98498 90322***



## ఫైటింగ్‌కి రెడీ...

అందమైన అమ్మాయిలు ఫైటింగ్‌కి కాలుదువ్వుతున్నారంటే వినడానికి సొంపుగా ఉంటుంది తప్ప చూడడానికి అంత బాగుండకపోవచ్చు. కానీ...లీడర్ ఫేమ్ రిచా గంగోపాధ్యాయ కిక్ బాక్సింగ్ ఫోజులు జనాలకు నిజంగానే కిక్కెస్తున్నాయని పలువురు అంటున్నారు. ఇంతకీ రిచా కిక్ బాక్సింగ్ ప్రాక్టీసు చేస్తున్నది సినిమా కోసం కాదట! ఆత్మరక్షణ కోసమూ కాదట! సౌందర్య పరిరక్షణ కోసమట! బెంగాలీ భామ అయిన రిచాకు స్వీట్స్ అంటే ప్రాణమట! హీరోయిన్ కాకముందు తెగ స్వీట్లు తిన్నా, ఇప్పుడు నోరు కట్టేసుకోవలసి రావడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించింది. కిక్ బాక్సింగ్ ఒక్కటే ఆమెకు మంచి మార్గంగా తోచింది! దాంతో కంటికి నచ్చింది తినేస్తూ రోజుకు ఓ రెండు గంటల పాటు కిక్ బాక్సింగ్ ప్రాక్టీసు చేస్తోందట! హీరోయిన్ కాకముందు కూడా కిక్ బాక్సింగ్ ప్రాక్టీసు అలవాటు ఉన్నా ఇప్పుడు అది తప్పనిసరి చేసుకుందట! కిక్ బాక్సింగ్ వలన బోలెడన్ని క్యాలరీలు కరిగే అవకాశం ఉందనీ, బరువు తగ్గాలనుకునే హీరోయిన్లు తన దగ్గరకి వస్తే కిక్ బాక్సింగ్ నేర్పిస్తాను అని కూడా అంటోంది. ఈ వరుసలో బహుశా ఆర్తీ అగర్వాల్ ముందు ఉండవచ్చని పలువురు జోకులు పేలుస్తున్నారు.